# మత్త విలాస ప్రహసనం

Originally written in
Sanskrit
by
Pallava King Mahendravikrama Varma I
(571-630 CE)

**తెలుగు అనువాదం: కె. నాగరాజన్ (2024)**

**email: knr_sh@yahoo.com**
**website: http://taoofeverything.in/**

# Acknowledgements

**Special thanks** to my daughters Samragni and Manogna and my best friend and my children's mother Rashmi for their support and encouragement through-out all my translation adventures, starting with **Ponniyin Selvan.**

Nagarajan

# Foreword

I first came across a reference to this play while I was translating Kalki's epic historical novel *Sivakamiyin Sabatham* from the original Tamil version to Telugu. From the snippets in that novel, I got an idea that king Mahendra Varma takes a dig at the degenerate religious sects at that time in Tamil Nadu, including kapalika, Pashupati and even Buddists and Jain monks.

This is a short one-act satire set in Kanchipuram, the then capital of Pallava kingdom. Kanchi was not just the political capital, but the seat of highest education in south India, rivaling Varanasi in the north. Culturally it was highly sophisticated as well and king Mahendra was keen on reviving Hinduism in the south and had done a lot in terms of building cave temples, mostly Shiva temples, encouraging religious studies and so on.

King Mahendra himself was a great scholar and also an accomplishied musician. This play is probably the first, or at least one of the earliest, satires in Indian literature.

From the Wikipedia:

“*Mattavilasa Prahasana* is a satire that pokes fun at the peculiar aspects of the heretic Kapalika and Pasupata Saivite sects, Buddhists and Jainism. The setting of the play is Kanchipuram, the capital city of the Pallava kingdom in the seventh century. The play revolves around the drunken antics of a Kapalika mendicant, Satyasoma, his woman, Devasoma, and the loss and recovery of their skull-bowl. The cast of characters consists of *Kapali* or Satysoma, an unorthodox Saivite mendicant, *Devasoma*, Satysoma’s female partner, a *Buddhist Monk*, whose name is Nagasena, *Pasupata*, a member of another unorthodox Saivite order and a *Madman*. The act describes a dispute between a drunken Kapali and the Buddhist monk. The inebriated Kapali suspects the Buddhist monk of stealing his begging bowl made from a skull, but after a drawn-out argument it is found to have been taken away by a dog.”

References:


1. https://en.wikipedia.org/wiki/Mattavilasa_Prahasana
2. Sanskrit in Latin script: https://ignca.gov.in/sanskrit/matta_vilasa_prahasanam.pdf
3. Sanskrit: https://archive.org/details/MattaVilasaPrahasanammulam
4. Sanskrit: https://sa.wikisource.org/wiki/%E0%A4%B8%E0%A4%9E%E0%A5%8D%E0%A4%9A%E0%A4%BF%E0%A4%95%E0%A4%BE:Matta_Vilasa_Prahasanam_Mahendra_Vikrama_Ed._Ganapati_Sastri_T.S._University_of_Travancore_50.pdf


Best regards,
Nagarajan

# మత్త విలాస ప్రహసనం

## పాత్రలు

**సూత్రధారి :** రంగస్థల పర్యవేక్షకుడు (రంగస్థలానికి బాధ్యత వహించేవాడు)

**నటి :** సూత్రధారి మొదటి భార్య. నాటకాన్ని అమర్చడంలో సహాయపడే వ్యక్తి

**కాపాలికుడు :** ఒక కపాలాన్ని భిక్షాపాత్రగా కొన్న ఒక విధర్మవాదియైన శైవ సన్యాసి సత్యసోముడన్న పేరుగొన్నవాడు.

**దేవసోమ :** సత్యసోముని ప్రేయసి

**శాక్యభికువు / బౌద్ధ సన్యాసి :** నాగసేనుడనే పేరుగొన్న బౌద్ధ సన్యాసి

**పాశుపతుడు :** బభ్రుకల్పుడనే పేరుగొని మరొక విధర్మ శైవమతశాఖకు చెందినవాడు

**ఉన్మత్తుడు :** ఒక పిచ్చివాడు

# మత్త విలాస ప్రహసనం

(దైవస్తోత్రం తర్వాత సూత్రధారి ప్రవేశం)

**సూత్రధారి :** ఆహ్... రెండవభార్య వల్ల కోపంగొన్న నా మొదటిభార్యను సంతోషపెట్టేందుకు ఒక మంచి దారి ఉంది. చాల కాలం తర్వాత ఒక నాటకాన్ని ప్రదర్శించమని రాజాస్థానం నుంచి ఆదేశం వచ్చింది. ఆమెనే అడుగుదాం.

(రంగస్థలం వెనుక పరికించి చూసి)

అమ్మా, కాస్త ఇలా రా.

(నటియైన మొదటి భార్య ప్రవేశిస్తుంది)

**నటి :** (కోపంగా) ఏమయ్యా ఇది? వయసు మీరిన ఈ తరుణంలో యువపాత్రలు తాగి తందనాలాడే వ్యంగ్య నాటకాన్ని వేయబోతున్నారా ?

**సూత్రధారి :** అదలాగే.

**నటి :** అలాగైతే మీరు రసాస్వాదన చేసే ఒక దాన్ని నాటకంలో వేసుకొని చేయండి.

**సూత్రధారి :** నీముందే ప్రదర్శిస్తాను.

**నటి :** అలాగని ఆమె మీకు బోధించిందా ?

**సూత్రధారి :** అదలా ఉండనీ. ఏదేమైనా, అక్కడికి వెళితే చాల గౌరవమర్యాదలు దొరుకుతాయి.

**నటి :** అది మీకే సరి.

**సూత్రధారి :** కావచ్చు ప్రియతమా. కానీ నీ నటనకు సభికులందరూ ఆనంద సముద్రంలో మునిగి తేలుతారు.

**నటి :** (సంతసించి) అలాగైతే మనకు మన గౌరవనీయులైన ప్రభువుల అనుమతి దొరికిందన్నమాట ?

**సూత్రధారి :** అవును.

**నటి :** అలాగైతే మీరు ఈ సంతోషకరమైన వార్త చెప్పినందుకు నేను మీకేం

బహుమానమివ్వాలి ?

**సూత్రధారి :** నీ సంతోషమే నాకు బహుమానం. ఇంకేం కావాలి?

**నటి :** అలాగైతే, ఇప్పుడే నాటకాన్ని ప్రదర్శించబోతున్నారు ?

**సూత్రధారి :** నీవే చెప్పావు కద, 'తాగుడు మైకంలో తందనాలాడే వ్యంగ్య నాటకం'.

**నటి :** (తనలో) నేను చెప్పేదంతా ఆయన ఉద్దేశానికి తగినట్లుండడంతో నా
కోపంకూడ మామూలుగానే ఉందాయనకు. (పైకి) ఈ రచనతో విజయం
సాధించనున్న ఆ కవి ఎవరో మరి?

**సూత్రధారి :** విను ప్రియతమా. ఆయనే శ్రీ మహేంద్ర విక్రమవర్మ అన్న పేరుగొన్న
రాజాధిరాజు. కామ, క్రోధ, మోహ, లోభ, మద మాత్సర్యాలను జయించి,
ఇతరుల క్షేమం కోసం తన్ను తాను సామాన్యస్థాయికి తెచ్చుకొన్న
నిర్మలమైనవారు. సంపదలో కుబేరుని తలదన్నేవారు. వీరత్వంలో
ఇంద్రునికి సమానమైనవారు. తమ ఋజుప్రవర్తనతో, సామర్థ్యంతో
చుట్టుపక్కల ఉన్న చిన్నరాజ్యాలను కట్టుదిట్టంగా పాలిస్తున్నవారు. పల్లవ
వంశంలోనే మేరుపర్వతం! శ్రీ సింహవిష్ణువర్మ కుమారులు. ఆయనే ఈ నాటక
రచయిత.

**నటి :** మరింకేం ఆలస్యం? వెంటనే అపూర్వమైన ఈ నాటకాన్ని ప్రదర్శించాలి.

**సూత్రధారి :** మన్నించాలి. పితామహుని గొప్పతనాన్ని పద్యరూపంలో పాడి
స్తుతించిన పిమ్మటే ప్రారంభించడం నా అలవాటు.

**[నేపథ్యంలో ]:** ప్రియతమా, దేవసోమా !

**సూత్రధారి :** కపాలాన్ని భిక్షాపాత్రగా చేతబట్టిన యువప్రేమిక కాపాలికుడు
అమితంగా మధువును సేవించినట్లు.
(వారు నిష్క్రమిస్తారు)

(ఇంతటితో నాంది సమాప్తం)

(అప్పుడు కాపాలికుడు తన యువతీసమేతంగా ప్రవేశిస్తాడు)

**కాపాలికుడు :** (తాగిన మైకంలో) ప్రియా దేవసోమా! ఒకడు తన తపోశక్తితో తాను కోరుకొన్న రూపాన్ని పొందగలడన్నది నిజం. నీవేమో ఒక్క క్షణంలో నీ వ్రతం వల్ల కళ్ళు చెదిరే కొత్తరూపాన్ని పొందావు!

ముత్యాలవంటి స్వేదబిందువులతో మెరుస్తున్న నీ ముఖం
తీరైన నీ కనుబొమలు
సున్నితమైన నీ పెదవులు
నీ అందం వర్ణనాతీతం!

**దేవసోమ :** దేవా, నేను తాగి ఉన్నట్లు, తాగిన నాతో మాట్లాడుతున్నట్లు మీరిప్పుడు మాట్లాడుతున్నారు.

**కాపాలికుడు :** ఏమంటున్నావు, ప్రియతమా?

**దేవసోమ :** దేవా, లోకం గిర్రున తిరుగుతూంది. నేను కింద పడిపోతానేమోననిపిస్తూంది. నన్ను పట్టుకోండి.

**కాపాలికుడు :** అలాగే ప్రియతమా. (ఆమెను పట్టి నిలబెట్టడానికి ప్రయత్నిస్తాడు. కానీ తానే కింద పడతాడు.) ప్రియా సోమదేవా, నేను నిన్ను పట్టి నిలబెట్టడానికి వస్తే నీవెందుకు అవతలికి వెళ్ళావు? కోపమా?

**దేవసోమ :** అవును, సోమదేవకు కోపమొచ్చింది. మీరు తల వంచి బతిమాలినా తొలగిపోతూంది.

**కాపాలికుడు :** నీవు సోమదేవవు కద? (కాసేపాలోచించి) కాదు, కాదు, దేవసోమా!

**దేవసోమ :** అంతా బూటకం, మీకు సోమదేవ అంటే చాల ప్రియం. అందుకే మీరు నన్ను పేరు పెట్టి కూడ పిలవడం లేదు.

**కాపాలికుడు :** నా ప్రియాతి ప్రియతమా! అది నోరు జారడం వల్ల జరిగిన పొరబాటు. నా తాగుడు మైకమే నిజమైన నేరస్తుడు.

**దేవసోమ :** అమ్మయ్య! మీరు కాదు కద.

**కాపాలికుడు :** ఈ చెడ్డ తాగుడు అలవాటు నన్నెంతగా బాధిస్తూంది? ఈ క్షణం నుంచే తాగుడు మానేస్తాను.

**దేవసోమ :** వద్దు, వద్దు దేవా! నా కోసం మీరు శపథాన్ని విరిచి, మీ తపస్సుకు భంగం కలగనివ్వకండి (అంటూ, వాడి కాళ్ళ మీద పడుతుంది.)

**కాపాలికుడు :** (హర్షాతిరేకంతో ఆమెను లేవనెత్తి కౌగలించుకొంటాడు.) భలే! భలే! శివపరమాత్మకు జయహో!

మధువు గ్రోలి ప్రియురాలి అందాన్ని ఆస్వాదిస్తూ
స్వీయప్రజ్ఞ వీడి తరించు
ముక్తి మార్గాన్ని ఇలా విధించిన
ఆ శూలాయుధపాణికి జయహో!

**దేవసోమ :** దేవా, అలా అనకండి. ముక్తి మార్గాన్ని శ్రమణులు ఇంకొక విధంగా ప్రవచిస్తున్నారు.

**కాపాలికుడు :** ప్రియతమా, వారందరూ నాస్తికులు.

**దేవసోమ :** ఆపండి. ఇలా మాట్లాడడమే పాపం. ఆపండి.

**కాపాలికుడు :** అవునవును, ఆపండి ఇటువంటి పాపాన్ని ఆపండి. ఆ భ్రష్టులు నిందకు కూడ అర్హులు కారు. సన్యాసదీక్ష తీసుకొని, తల బోడి చేయించుకొని, అశుద్ధంగోని, భోజనానికి కూడ వేళ విదించే నీచులు. కాబట్టి నాస్తికులను పొగిడిన నా నోటిని మధువు సేవించి శుద్ధం చేసుకొంటాను.

**దేవసోమ :** అలాగైతే మనం ఇంకొక మధుశాలకు వెళదాం.

**కాపాలికుడు :** అలాగే ప్రియతమా. (వారిద్దరు నడిచి అవతలికి వెళతారు.)

**కాపాలికుడు :** ఆహా! ఏమి ఈ కంచి నగర వైభవం, సిరి సమృద్ధి! ఆ ఏకాంబరేశ్వరుని కోవెల విమానం మేఘాలను తాకుతున్నందుకు తగినట్లు ఆలయం నుంచి మృదంగ ధ్వని! వసంతమే రూపంగొన్నట్లున్న పూల అంగళ్ళు! అందమైన యువతుల కాలి గజ్జెల శబ్దం మన్మధుని తలపిస్తోంది.

**దేవసోమ :** దేవా, ఈ కంచి ఈ దైవ మధువు లాగే ఎంతో రుచిస్తూంది.

**కాపాలికుడు :** ప్రియా, చూడు, చూడు! ఈ మధుశాల యాగశాల పక్కనే ఎంత చక్కగా అమరివుంది! అక్కడున్న ధ్వజస్తంభాన్ని చూడు. అదే యజ్ఞగుండ స్తంభం. మధువే సోమరసం. జాడీలు పుణ్యపాత్రలు. కాల్చిన

మాంసపు ముక్కలు, తక్కిన తినుబండారాలే రుచ్యమైన నైవేద్యం. మత్త ప్రేలాపనలు యజుర్వేద మంత్రాలు. పాటలు సామవేద గీతాలు. తోలుసంచే యాగఫలం దాచుకొనే సంచి. తపస్సే అగ్ని. మధుశాలల్లోని వ్యాపారులే యాగ నిర్వాహకులు.

**దేవసోమ :** మన భిక్ష శివుని కోసం తీసిపెట్టిన యాగఫలంలో వంతు.

**కాపాలికుడు :** ఆహ్! తాగి తందనాలాడ్డం ఎంత బాగుంది. మద్దెల తాళానికి తగినట్లు ఆడే అంగాంగాలు, పాడే గొంతు, కదిలే కళ్ళు. పైబట్టను సరిచేసుకొని పంచెను తాళానికి తగినట్లు సరిచేసుకొని ఆడుతుంటే ఎంత సొబగో.

**దేవసోమ :** ఆహ్! స్వాములు చాల రసికులు.

**కాపాలికుడు :** ఈ దైవ మధువును పాత్రలో పొయ్. వస్త్రాభరణాల గురించి పట్టించుకోకు. మనసైన ప్రేమికులు ఒక్కరవుతారు. యువతీయువకులు సిగ్గు వీడి వీరులవుతారు. జీవితకాలమంతా ప్రేమ వర్ధిల్లుతుంది. మాటలకింకేం పని?

మునుపు శివుడు మూడో కన్ను తెరిచి
మన్మధుని భస్మం చేశాడన్నది అబద్ధం
మన్మధుడు తానే నీరై కరిగిపోగా
అదే మనని ఇప్పుడు కాలుస్తూంది;

**దేవసోమ :** కావచ్చు. కానీ లోకకల్యాణం కోరి అన్నీ చేసే దేవుడు లోకాన్ని నాశనం చేయడు.

(ఇద్దరూ లెంపలేసుకొంటారు)

**కాపాలికుడు :** భవతీ, భిక్షాం దేహి.

**అశరీరి :** (ఆడగొంతులో - తెర వెనుక నుంచి) దేవా, ఇదిగో భిక్ష. తీసుకోండి.

**కాపాలికుడు :** స్వీకరిస్తున్నాను ... ప్రియా, నా కపాల భిక్షాపాత్ర ఎక్కడ?

**దేవసోమ :** నేను కూడ దాన్ని చూడలేదు.

**కాపాలికుడు :** (కాస్త ఆలోచించి) ఆ! ఆ కిందటి మధుశాలలోనే మర్చిపోయి

ఉండాలి. మళ్ళీ వెళ్ళి చూద్దాం.

**దేవసోమ :** దేవా! గౌరవమర్యాదలతో ఇవ్వబడుతున్న దానాన్ని స్వీకరించక పోవడం పాపం. మనమిప్పుడేం చేద్దాం?

**కాపాలికుడు :** ప్రియా, అత్యవసర పరిస్థితి కాబట్టి పశువు కొమ్ములో ఆ భిక్షను స్వీకరించు.

**దేవసోమ :** అలాగే దేవా.

(వారు భిక్షను పశువు కొమ్ములో స్వీకరిస్తారు)

(ఇద్దరూ చుట్టూ కలయ వెతుకుతారు)

**కాపాలికుడు :** ఏమి? ఇక్కడెక్కడా అది కనిపించడం లేదేమి? (ఆశలొదులుకొని) ఆ! మహేశ్వరులారా! నా భిక్షాపాత్రను చూశారా? ఏమంటున్నారు? చూడలేదంటున్నారా? ... హతోస్మి! నా నమ్మకమంతా నాశనమైపోయింది. నేనిక కాపాలికునిగా ఎలా జీవించగలను? ఎంతటి కష్టం!

(వాడు కింద పడి తల బాదుకొంటాడు.)

ఉండనీ. ఇదంతా ఒక పరీక్ష. కాపాలికుడనే పట్టం లేకపోతే నాకు నష్టమేం లేదు.

(లేస్తాడు.)

**దేవసోమ :** దేవా, మీ కపాల భిక్షాపాత్రను ఎవరు తీసుకొనివుంటారు?

**కాపాలికుడు :** ప్రియా, అందులో కాల్చిన మాంసపు ముక్కలున్నాయి. బహుశ ఒక కుక్కగాని, ఒక బౌద్ధ సన్యాసిగాని తీసుకొని వెళ్ళివుండాలి.

**దేవసోమ :** అలాగైతే కంచి నగరమంతా చుట్టు తిరిగి దాన్ని వెతుకుదాం.

**కాపాలికుడు :** అలాగే చేద్దాం, ప్రియా!

(చుట్టు తిరిగి వస్తారు)

(బౌద్ధ సన్యాసి ఒకరు చిప్పతోబాటు ప్రవేశిస్తారు)

**సన్యాసి :** (గొడుగు పట్టుకొని) ఆహా! వణిజుడు ధనదాసుని దానం అన్ని ఇళ్ళ

దానాల కన్న మించింది. అతడిచ్చిన దానం, ఎంత రుచికరమైన, మేలైన చేపల పులుసు, ఎంతటి తృప్తికరమైన భోజనం నాకు. రాజవిహారానికి తిరిగి వెళతాను.

(తనలో తాను మాట్లాడుకొంటూ తిరిగి వెళతాడు.)

ఆహ్! మాళిగ నివాసం, మెత్తని పరుపు మీద నిద్ర, ప్రాతఃకాల భోజనం, సాయంత్రం రుచికరమైన పానీయాలు, ఐదు సువాసనల తాంబూలం, అందమైన బట్టలు మొదలైన వసతులు - దయామయుడైన బుద్ధ భగవానుడు సన్యాసులకు ఇవన్నీ అనుమతించి, మదిర, మానిని మాత్రం ఎందుకు నిషేధించారు? ఈ పనికిరాని, చేతగాని పెద్దలు యువకుల మీద అసూయతోనే ఈ రెండింటిని పాఠ్య పుస్తకాలనుంచి తొలగించారని సందేహిస్తున్నాను. అవి తొలగించబడని మూలపుస్తకం ఎక్కడ దొరుకుతుంది? బుద్ధుని బోధనలు పూర్తిగా బయటపెట్టి బౌద్ధులకందరికీ సహాయపడవచ్చు కద?

(చుట్టూ తిరుగుతుంటాడు.)

**దేవసోమ :** దేవా, అదిగో చూడండి. కాషాయదుస్తులు ధరించిన ఆ వ్యక్తిని. అటూ ఇటూ దొంగచూపులు చూస్తూ, ఈ రాజవీధిలో అమాయక ప్రజల కూటమి మధ్య దాగి వస్తున్నాడు.

**కాపాలికుడు :** నీవు చెబుతున్నది నిజమే ప్రియతమా. పైగా, వాడు చేతిలో దేన్నో దాచిపెట్టుకొని వెళుతున్నాడు.

**దేవసోమ :** దేవా, వాణ్ణి వదలకుండ పట్టుకొని విచారిద్దాం.

**కాపాలికుడు :** అమ్మాయీ, అలాగే చేద్దాం... ఓయ్ సామీ! ఆగు!

**సన్యాసి :** మనని అలా పిలుస్తున్నదెవరు? (తిరిగి చూస్తాడు.) ఓ... ఆ ఏకాంబరాలయం దుష్ట కాపాలికుడు. వాడి దుష్టచేష్టలకు మనం గురి కాకూడదు. (వేగంగా ముందుకు నడుస్తాడు.)

**కాపాలికుడు :** ప్రియా, నా కపాల భిక్షాపాత్ర దొరికేసింది! నన్ను చూసిన వెంటనే భయపడి పారిపోతున్నాడు. వాడి దొంగతనానికి ఇదే సాక్షి. (సన్యాసి

ముందుకు వేగంగా వెళ్ళి దారికడ్డం నిలబడి) ఆ! సన్యాసీ! ఇప్పుడెక్కడికి పారిపోగలవు?

**సన్యాసి :** సహోదరా, కాపాలికా! వద్దు, ఇలా చేయడం మంచిది కాదు, ఇలా నడుచుకోవద్దు (తనలో) ఆహా! సహోదరి ఎంతందంగా ఉంది!

**కాపాలికుడు :** ఓయ్, సామీ! వెంటనే చూపించేయ్. నీ దుస్తుల్లో దాచి నీ చేతిలో పట్టుకొన్నది ఏమి? నేను చూడాలి.

**సన్యాసి :** అక్కడేముంది? ఒట్టి భిక్షాపాత్ర మాత్రమే.

**కాపాలికుడు :** అదే, దాన్ని నేను చూడాలంటున్నాను.

**సన్యాసి :** సోదరా, ఇలా నడుచుకోకు. దీన్ని దాచిపెట్టుకొనే తీసుకెళ్ళాలి.

**కాపాలికుడు :** అవును, నిజమే. వస్తువులను దాచిపెట్టి తీసుకెళ్ళడం కోసమే ఇలా దుస్తులను ధరించమని బుద్ధభగవానుడు విధించాడు.

**సన్యాసి :** అవును, అది నిజమే.

**కాపాలికుడు :** అదే దాచిపెట్టబడ్డ నిజం. నిజమైన నిజాన్ని వినగోరుతున్నాను.

**సన్యాసి :** వేళాకోళం చాలు. యాచనకు వేళైంది. వెళ్ళాలి. (ఆయన బయల్దేరుతాడు.)

**కాపాలికుడు :** ఏయ్ ధూర్తుడా, ఎక్కడికెళుతున్నావు? నా కపాల భిక్షాపాత్రను ఇచ్చేసి వెళ్ళు.

(సన్యాసి బట్ట చివర పట్టుకొని లాగుతాడు.)

**సన్యాసి :** బుద్ధుని దివ్యనామాన్ని స్తుతించుగాక.

**కాపాలికుడు :** 'చోరకళ నేర్పిన దేవుని స్తుతించుగాక' అనాలి!

**సన్యాసి :** పాపం శమించుగాక! పాపం శమించుగాక!

**కాపాలికుడు :** మంచిగా నడుచుకొనే ఒక పెద్ద తపస్వి ఎందుకు మన్నించబడరు?

**దేవసోమ :** దేవా, మీరు చాల అలిసిపోయినట్లున్నారు. కపాల భిక్షాపాత్రను తేలిగ్గా కనిపెట్టే దారి లేదు. కాబట్టి ఈ పశువు కొమ్ముసుంచే మధువు సేవించి కాస్త బలం పుంజుకొని తర్కాన్ని కొనసాగించండి.

**కాపాలికుడు :** అలాగే. (దేవసోమ కాపాలికునికి మధువు అందిస్తుంది.)

**కాపాలికుడు :** ప్రియా, నీవు కూడ సేద తీర్చుకోవాలి.

**దేవసోమ :** కానివ్వండి, దేవా. (ఆమె కూడ తాగుతుంది.)

**కాపాలికుడు :** ఈ కుంక మనని ఎదురుదెబ్బ తీశాడు. అయినా కూడ పరవాలేదు. మిగిలింది ఈ మునిపుంగవులక్కూడ ఇవ్వు.

**దేవసోమ :** దేవుల ఆన. అయ్యా, ఇది స్వీకరించండి.

**సన్యాసి :** (తనలో) ఎంత సులభంగా అదృష్టం కొట్టింది! కానీ ఇదే చిక్కు. ప్రజలు చూస్తారు. (పైకి) వద్దు. మేమీ కార్యం చేయకూడదు. (అంటూనే నాలుకతో పెదవులు తడి చేసుకొంటాడు.)

**దేవసోమ :** నాశనమై పో! ఈ యోగం నీకింకెక్కడ దొరుకుతుంది?

**కాపాలికుడు :** ప్రియా, వీడి వదరుబోతు మాటలు వీడి కోరికను బయటపెడుతున్నాయి .

**సన్యాసి :** నీకు కరుణే లేదా?

**కాపాలికుడు :** నాకు కరుణ ఉంటే, ఆశనుంచి విడుదల ఎలా దొరుకుతుంది?

**సన్యాసి :** ఆశనుంచి నీవు విడివడితే కోపంనుంచి కూడ విడుదల పొందుతావు.

**కాపాలికుడు :** నాకు చెందినది నాకిచ్చేస్తే నేను కోపం నుంచి విడుదల పొందేస్తాను.

**సన్యాసి :** నీకు చెందిన దేన్ని?

**కాపాలికుడు :** కపాల భిక్షాపాత్రను.

**సన్యాసి :** ఏ కపాల భిక్షాపాత్ర?

**కాపాలికుడు :** వీడంటున్నాడు 'ఏ కపాల భిక్షాపాత్ర?' అని. ఒక వేళ అదే నిజమేమో?

**దేవసోమ :** ఇలా తీయని మాటలతో ఇవ్వడు. వాడి చేతినుంచి బలవంతంగా లాక్కొని వెళదాం.

**కాపాలికుడు :** అదే సరి. ప్రియతమా. (వారు సన్యాసినుంచి అతని భిక్షాపాత్రను లాక్కోజూస్తారు.)

**సన్యాసి :** దుష్ట కాపాలికా, నీవు నాశనమై పోను (కాపాలికుని చేత్తో తోసేసి, కాలితో తన్నుతాడు.)

**కాపాలికుడు :** ఆఁ! తన్ని తోసేశాడు!

**దేవసోమ :** అయోగ్యుడా, నీవు చచ్చావు పో. (ఆమె అతని జుట్టు పట్టుకోవడాకి ముందుకు చేయి చాచి దూకుతుంది. కానీ చేతికి జుట్టు దొరక్క పోవడంతో నిలదొక్కుకోలేక కింద పడుతుంది.)

**సన్యాసి :** (తనలో) తల బోడి కొట్టించుకోవాలని విధించిన బుద్ధుని యుక్తిని మెచ్చుకోవాలి. (పైకి) లే సోదరీ, లే. (ఆమెను లేవనెత్తుతాడు.)

**కాపాలికుడు :** చూడండి మహేశ్వరులారా! తాను సన్యాసినని చెప్పుకొంటూనే నా ప్రేయసి చేయి పట్టి లేవనెత్తిన ఈ నాగసేనుని చూడండి!

**సన్యాసి :** వద్దు సోదరా, వద్దు. కష్టంలో ఉన్నవారి మీద దయచూపి సహాయం చేయడం మా కర్తవ్యం.

**కాపాలికుడు :** అది నిజంగా బుద్ధభగవానుడు విధించిన నియమమేనా? ఉండనీ. ముందు నేను కింద పడలేదా? పోనీ. ఇప్పుడు నీ తల్లోపలున్న కపాలమే నాకు భిక్షాపాత్ర కాబోతూంది.

(అందరూ గుద్దులాటకు దిగుతారు.)

**సన్యాసి :** హింస! హింస!

**కాపాలికుడు :** మహేశ్వరులారా, చూడండి. తనని ఒక యోగి అని చెప్పుకొనే ఒక అయోగ్యుడు నా భిక్షాపాత్రను దొంగిలించడమే కాకుండ కేకలేసి మొర్రోమంటున్నాడు. కానీ, నేను కూడ కేకలేస్తాను. ఇది అబ్రాహ్మణ్యం, అబ్రాహ్మణ్యం!

(అప్పుడు ఒక పాశుపతుడు ప్రవేశిస్తాడు.)

**పాశుపతుడు :** సత్యసోమా, ఎందుకు కేకలేస్తున్నావు?

**కాపాలికుడు :** ఓ బభ్రుకల్పా, తన్ని తాను ఒక సన్యాసి అని చెప్పుకొనే ఈ దుష్టుడు నా కపాల భిక్షాపాత్రను దొంగిలించి, తిరిగి ఇవ్వనంటున్నాడు.

**పాశుపతుడు :** (తనలో) నేను ఏ పనిని చేసివుండాలో అది పరలోక గంధర్వులు
చేసేశారు!
నా ఈ పగవాడిని వీడినే తోడుగా పెట్టుకొని నలిపేస్తాను.
(పైకి) ఓ నాగసేనా! అతడు చెబుతున్నది నిజమేనా?

**సన్యాసి :** స్వామీ, మీరు కూడానా ఇలా మాట్లాడుతున్నారు?
ఇవ్వనిది స్వీకరించకపోవడం మా ధర్మం;
ఒట్టి మాటలకు దూరంగా ఉండడం మా ధర్మం;
అవమానాలకు దూరంగా ఉండడం మా ధర్మం;
వేళ తప్పి భోజనం చేయకపోవడం మా ధర్మం;
బుద్ధం ధర్మం సంఘం శరణం గచ్ఛామి.

**పాశుపతుడు :** సత్యసోమా, ఇది వారి మంచి నడతను ఎత్తి చూపుతోంది. దానికి నీ బదులేమి?

**కాపాలికుడు :** ఒట్టి మాటలకు దూరంగా ఉండడం మా ధర్మం.

**పాశుపతుడు :** రెండూ సరి. ఈ సమస్యను ఎలా పరిష్కరించడం?

**సన్యాసి :** బుద్ధుని నియమాలను పాటించే ఒక సన్యాసికి మధుపాత్రను తాకే అవసరమేముంటుంది?

**పాశుపతుడు :** ఊహామాత్రంగా కల్పించబడ్డ నెపమేదీ నిందకు ఆధారం కాజాలదు.

**కాపాలికుడు :** కళ్ళ ముందు కనిపిస్తున్న దృశ్యం ముందు ఏ తర్కమూ నిలబడలేదు!

**పాశుపతుడు :** ఎక్కడ ఆ దృశ్యం?

**దేవసోమ :** దేవా, అదే అతది చేతనున్న కపాల భిక్షాపాత్ర. దుస్తుల లోపల దాచబడివుంది.

**పాశుపతుడు :** విన్నావా?

**సన్యాసి :** దేవా, ఈ పుర్రె చిప్ప ఇంకెవరికీ చెందినది కాదు.

**కాపాలికుడు :** మరైతే చూపించు.

**సన్యాసి :** మంచిది. (ఆయన చూపుతారు.)

**కాపాలికుడు :** చూడండి మహేశ్వరులారా, ఈ కాపాలికుడు చేస్తున్న అన్యాయాన్ని,

బౌద్ధుల విలక్షణమైన ప్రవర్తనను!

**సన్యాసి :** ఇవ్వనిది స్వీకరించకపోవడం మా ధర్మం;

ఒట్టి మాటలకు దూరంగా ఉండడం మా ధర్మం;

అవమానాలకు దూరంగా ఉండడం మా ధర్మం;

వేళ తప్పి భోజనం చేయకపోవడం మా ధర్మం;

బుద్ధం ధర్మం సంఘం మా ఆశ్రయం.

(సన్యాసి, కాపాలికుడు ఇద్దరూ అటూ ఇటూ ఊగనారంభిస్తారు.)

**సన్యాసి :** ఆఁ! సిగ్గుపడవలసినవాడు ఆడుతున్నాడు!

**కాపాలికుడు :** ఆఁ! ఆడుతున్నదెవరు? (చుట్టూ తిరిగి చూసి) నిస్సందేహంగా ఇదెందుకంటే, కనిపించకపోయిన నా కపాల భిక్షాపాత్ర ఇప్పుడు కనిపించినందువల్ల మలయమారుతంలో నా అలసట అనే తీగ అటూ ఇటూ ఊగుతుండడం చూసి నేనాడుతున్నానని భ్రమిస్తున్నాడు కాబోలు!

**సన్యాసి :** దేవా, మాట్లాడరేమి? మీరు దాని వర్ణాన్ని గమనించలేదా?

**కపాలికుడు :** అక్కడ గమనించేందుకేముంది? నేను చూడడమైంది. కాకి కన్న నలుపు.

**సన్యాసి :** అలాగైతే అది నాది అని ఒప్పుకో.

**కాపాలికుడు :** నిజమే, ఒప్పుకొంటాను నీ రంగులు మార్చే స్వభావాన్ని, సామర్థ్యాన్ని! ఎర్ర తామరరేకులు ఉన్నట్లుండి సూర్యకిరణాలు నోకి తెల్లబడ్డట్లు!

**దేవసోమ :** చచ్చాను! అన్ని సుగుణాలుగొన్న తెల్ల తామర లాంటి మన భిక్షాపాత్ర వీడి మురికి బట్టలు తగిలి నల్లబడిపోయింది కద? ఇప్పుడెలా?

(ఏడవనారంభిస్తుంది)

**కాపాలికుడు :** ప్రియతమా, దిగులుపడకు. దాన్ని మళ్ళీ పరిశుభ్రం చేయవచ్చు. మన తపశ్శక్తితో పాపాలను కడిగేసినట్లు మన భిక్షాపాత్రను కూడ ప్రక్షాళనం చేసుకోవచ్చు.

ఓ, బభ్రుకల్పా, అలాగే కద?

**పాశుపతుడు :** ఆగమశాస్త్రం ప్రకారం అది నిజమే.

**సన్యాసి :** సరి, రంగు నావల్ల వచ్చిందే, మరి రూపం, పరిమాణం మాటేమి?

**కాపాలికుడు :** మాయాదేవి బిడ్డ పరంపరలో వచ్చినవాడివి కద నీవు?

**సన్యాసి :** ఎంతసేపని నీతో ఇలా వాదిస్తూ పోవడం? దేవా, ఇదిగో తీసుకో.

**కాపాలికుడు :** మంచిది. బుద్ధుడు ఇలాగే మహాదాత అయ్యాడు.

**సన్యాసి :** ఇదిలాగే సాగుతుంటే, నాకు ఆశ్రయమేది?

**కాపాలికుడు :** తప్పకుండ బుద్ధం ధర్మం సంగం.

**పాశుపతుడు :** నేనీ సమస్యను పరిష్కరించలేకపోతున్నాను . వెళదాం పదండి
న్యాయమందిరానికి .

**దేవసోమ :** దేవా, మనమక్కడికి వెళితే, మనం మన కపాల భిక్షాపాత్రను
కోల్పోవడం తథ్యం.

**పాశుపతుడు :** ఏమంటున్నావు నీవు?

**దేవసోమ :** మఠంలో అన్ని వసతులతో జీవితం వెళ్ళబుచ్చుతున్న ఈ ఆసామీ తాను
కూడబెట్టిన ధనమంతా వెచ్చించి న్యాయమూర్తుల నోళ్ళు మూసేస్తాడు. కట్టుబట్టలు
తప్ప ఇంకే ధనంగాని, పలుకుబడిగాని లేని మేమెలా వెళ్ళగలం
న్యాయమందిరానికి ?

**పాశుపతుడు :** అలాగేం లేదు. సత్ప్రవర్తన కలిగినవారికి ఆ న్యాయమందిరంలో
తప్పక న్యాయం లభిస్తుంది. ఆ మందిరాన్ని ఎత్తి పట్టుకొన్న స్తంభాల్లాగే
న్యాయమూర్తులు న్యాయాన్ని పరిరక్షిస్తారు.

**కాపాలికుడు :** ఆ ఒక్క మాటే చాలు. మంచిగా నడుచుకొనేవారు
భయపడనవసరం లేదు.

**సన్యాసి :** అయ్యా, దారి చూపండి.

**పాశుపతుడు :** తప్పక...

(అందరూ బయల్దేరుతారు)

(అప్పుడొక పిచ్చివాడు ప్రవేశిస్తాడు.)

**పిచ్చివాడు :** అదిగో, అదిగో అక్కడుందా దుర్మార్గపు కుక్క. కాల్చిన మాంసం ముక్కలున్న కపాలం చిప్పను నోట కరుచుకొని పరుగెత్తుతున్నావ్. అయోగ్యుడా, ఎక్కడికి వెళతావు? ఇప్పుడా పుర్రెచిప్పను కింద పడేసి నావైపు పరుగెత్తుకొస్తూంది. (చుట్టూ చూసి) నేను దాని పళ్ళను ఈ రాతితో రాలగొడతాను. దిక్కుమాలిన పిచ్చికుక్కా, ఎందుకు కపాలాన్ని పడేసి పరుగెత్తుతున్నావ్? ఈ వీరత్వంలో ఎందుకు నామీద ఎగిరిపడుతున్నావ్? నేను.. నేను ఊరపంది వీపుమీదెక్కి ఆకాశానికెగురుతాను. సముద్రాన్ని ఆయుధంగా చేసుకొని ఐరావతాన్ని ఓడించాను. ఓయ్ వెధవా, ఏమంటున్నావ్? అదంతా అబద్ధమనా? కాబట్టి బలిసిన జోరీగలాంటి చేతులున్న ఈ గజ్జి పట్టిన కప్పే మనకు సాక్షి. ఏం? ముల్లోకాల్లో వీరత్వానికి పేరుగాంచిన ఒకడికి సాక్షి ఎందుకు? సరే నేనిలా చేస్తాను. ఆ కుక్క వదిలిపెట్టి పోయిన మాంసం ముక్కలు నేను తింటాను. (తింటాడు. పిచ్చి తలకెక్కుతుంది.) కన్నీళ్ళే నన్ను చంపుతున్నాయి. (వాడు ఏడుస్తూ చుట్టూ తిరిగి చూస్తాడు.) ఎవరు నన్ను కొడుతున్నారు? (చుట్టూ తిరిగి చూసి) దుష్టుల్లారా! భీమసేనునికి ఘటోత్కచుని లాగ నేను ఒకరికి మేనల్లుడిని.

దయచేసి క్రూరులైన యువకులే వద్దు.
ఈ మాంసం ముక్కల కోసం నన్ను వేధించకండి.

(చుట్టూ చూసి) మన ఆచార్యులు సురనంది అక్కడున్నారు. ఆయన వద్దకే వెళతాను.

(వాడు పరుగెడతాడు.)

**పాశుపతుడు :** ఓయ్, ఆ పిచ్చివాడు ఇక్కడికే వస్తున్నాడు చూడు.

**పిచ్చివాడు :** నేను వాడి దగ్గరికే వెళతాను. (సమీపించి) దేవా, ఒక ఛండాలునికి చెందిన ఒక మేలుజాతి కుక్క దగ్గరినుంచి నేను పొందిన ఈ కపాల

భిక్షాపాత్రను స్వీకరించండి.

**పాశుపతుడు :** (దాన్ని పరికించి చూసి) పాత్రుడైన వాడికివ్వు.

**పిచ్చివాడు :** మహాత్మా, సంతోషంగా స్వీకరించండి.

**సన్యాసి :** ఈ గౌరవనీయుడైన పాశుపతుడే అందుకు పాత్రుడు.

**పిచ్చివాడు :** (కాపాలికుని ముందుకు వచ్చి అతని ముందు నేలమీద కపాల భిక్షాపాత్రను పెడతాడు. తర్వాత ఎడమవైపు నుంచి అతని చుట్టు తిరిగి వచ్చి అతని కాళ్ళ మీద పడతాడు.) మహాదేవా! ఆనందం వర్ధిల్లుగాక. మీకు అనేక వందనాలు.

**కాపాలికుడు :** ఇది మా కపాల భిక్షాపాత్ర!

**దేవసోమ :** ఇదే!

**కాపాలికుడు :** దేవుని దయవల్ల నేను మళ్ళీ కాపాలికుడనైనాను. (అతడు దాన్ని సమీపిస్తాడు.)

**పిచ్చివాడు :** అయోగ్యుడా, విషం తాగు! (కపాలాన్ని అపహరించుకొని పరుగెడతాడు.)

**కాపాలికుడు :** (వెన్నాడుతూ) ఈ యమకింకరుడు నా ప్రాణాలను తీసుకొని వెళుతున్నాడు. మీరిద్దరూ నన్ను కాపాడండి.

**ఇద్దరూ :** మంచిది. మేమిద్దరం నీకు సహాయం చేస్తాం.

(అందరూ దారి మళ్ళుతారు.)

**కాపాలికుడు :** ఏయ్, ఆగు!

**పిచ్చివాడు :** నన్నెందుకు అడ్డగిస్తున్నావు?

**కాపాలికుడు :** మా కపాల భిక్షాపాత్రను ఇచ్చేసి పో.

**పిచ్చివాడు :** మూర్ఖుడా! తెలియడం లేదా? ఇది ఒక బంగారు గిన్నె.

**కాపాలికుడు :** ఎవరిలాంటి బంగారు గిన్నెను తయారు చేసివుంటారు?

**పిచ్చివాడు :** నేనెందుకు ఇది ఒక బంగారు గిన్నె అన్నానంటే, బంగారు బట్టలే ధరించే ఒక కంసాలి బావమరిది చేత చేయబడిందీ పాత్ర.

**సన్యాసి :** నీవేమంటున్నావు?

**పిచ్చివాడు :** ఇది ఒక బంగారు గిన్నె.

**సన్యాసి :** ఏమి, వీడొక పిచ్చివాడా?

**పిచ్చివాడు :** నేను తరచూ వినే మాట, పిచ్చివాడు; ఇదిగో దీన్ని ఉంచుకో.

పిచ్చోణ్ణి నాకు చూపించు.

(వాడు కపాల భిక్షాపాత్రను కాపాలికుడికి ఇస్తాడు.)

**కాపాలికుడు :** (కపాల భిక్షాపాత్రను తీసుకొని) వాడిప్పుడు ఆ గోడ వెనక్కెళ్ళాడు. వేగం వాణ్ణి వెంబడించి వెళ్ళు!

**పిచ్చివాడు :** ధన్యుడిని. (పిచ్చివాడు వేగంగా వెళతాడు.)

**సన్యాసి :** ఆహ్! భలే! నా శత్రువుకు పట్టిన అదృష్టానికి సంతోషిస్తున్నాను.

**కాపాలికుడు :** (కపాల భిక్షాపాత్రను హత్తుకొని)

నా కాలమంతా తపస్సుకు వెచ్చించి
మహేశ్వరునికి నన్నే అర్పించుకొన్నాను
పునీతమైన కపాలభిక్షాపాత్రను చూసిన ఈ క్షణమే
నా మనసు సేదదీరి ఆతని చెంత చేరింది!

**దేవసోమ :** దేవా, సాయంకాలపు చంద్రునిలాగ మీరు నా కళ్ళకు చూడనింపుగా ఉన్నారు.

**పాశుపతుడు :** అదృష్టవశాత్తు మీరు జయించారు.

**కాపాలికుడు :** ఈ అదృష్టం మీదే.

**పాశుపతుడు :** (తనలో) కల్లాకపటం తెలియనివారు దేనికి జంకనవసరం లేదు. అందువల్లే ఈ బౌద్ధసన్యాసి ఈ పులి నోటినుంచి తప్పించుకొన్నాడు. (పైకి) నేను మన స్నేహితుని అదృష్టాన్ని ప్రాతఃకాల దేవతను పూజించేటప్పుడు గుర్తు తెచ్చుకొంటాను.

(పాశుపతుడు నిష్క్రమిస్తాడు.)

**కాపాలికుడు :** ఓ నాగసేనా, నా తప్పులను మన్నించమని వేడుకొంటున్నాను.

**సన్యాసి :** అందులో ఏముంది? నిన్ను సంతోషపరిచేందుకు నేనేం చేయాలి?

**కాపాలికుడు :** నా మూలంగా మీరు సంతసిస్తారంటే నాకు దానికన్న ఇంకేం కావాలి?

**సన్యాసి :** నేను వెళ్ళనా?

**కాపాలికుడు :** మంచిది. మళ్ళీ కలుద్దాం.

**సన్యాసి :** అలాగే. (వారు బయల్దేరుతారు.)

**కాపాలికుడు :** ప్రియా దేవసోమా, మనం కూడ బయల్దేరుదాం.

(భరత వాక్యం)

శాశ్వత్ భూత్యై ప్రజానాం వహతు విధిహుతామ్ ఆహుతిమ్ జాతవేదా
వేదాన్ విప్ర భజంతామ్ సురభి దుహితారో భూరి-దోహ్ భవంతు |
ఉద్యుక్తహ శ్వేశు ధర్మే శ్వ అయమ్ అపి విగత వ్యాపాదాచంద్ర-తారామ్
రాజన్వానస్ తు శక్తి -ప్రశమిత రిపుణ శత్రుమల్లేన లోకః
(ఇద్దరూ నిష్క్రమిస్తారు.)

-: *మత్త విలాస ప్రహసనం* ఇంతటితో సమాప్తం :-